విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

ఆదివారం 15 సెప్టెంబరు 2024 8 పేజీలు

నిఘా నేత్రాలు కల్లుగప్పి అంతుచిక్కని దొంగతనాలు

- వార్త 2లో

- రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో జాడలేని నిఘా యంత్రాలు

విశాలాంధ్ర - గుడిపాల:

జిల్లాలోని గుడిపాల మండలం రెండు రాష్ట్రాల సరిహద్దులు ఉన్న నేపథ్యంలో నిఘా యంత్రాల జాడ లేకపోవడంతో దొంగల ముఠాలను పట్టుకోవడంలో పోలీసులకు సవాల్ గా మారింది. మండలంలోని ఓ నగల దుకాణంలో సుమారు 29 లక్షల విలువగల బంగారు ఆభరణాలు చోరీకి గురి అయ్యాయి.

2

వైభవంగా ... కాణిపాకం రథోత్సవం

థియేటర్లో కత్తిపోట్ల కలకలం

- యువకుడిపై మరో యువకుడు కత్తితో దాడి
- ఇద్దరు యువకులతో యువతి ప్రేమాయణం
- యువతి పక్కా ప్లాన్‌తో హత్యయత్నం చేయించిన వైనం

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి నగరంలో పిజిఆర్ థియే టర్లో కత్తిపోట్ల సంఘటన శనివారం తిరు పతి నగరంలో సంచలనం సృష్టించింది. వివరాలు ఇలా ఉన్నాయి. సూళ్లూరుపేటకు చెందిన కావ్య, ప్రకాశం జిల్లా గిద్దలూరుకి చెందిన లోకేష్‌తో కలిసి సినిమాకు వెళ్లారు. బాధిత యువ కుడితో కలిసి సినిమా టికెట్ బుక్ చేసిన కావ్య, అలాగే ఇద్దరు యువకులతో యువతి, ప్రేమ ప్రయాణం యువతి పక్క ప్లాన్‌తో హత్యాయత్నం చేయించినట్లు అనుమానం

2

2

మోహన్‌బాబు యూనివర్సిటీలో...

ఫీజులు దోపిడీని అరికట్టండి

- మోహన్‌బాబు యూనివర్సిటీలో ఫీజ్ రెగ్యులేషన్ కమిటీ ద్వారా విచారణచేయాలి

భాకరాపేట ఘాట్ రోడ్డులో ప్రమాదాల నివారణకు

వెంటనే చర్యలు చేపట్టాలి

3

లోక్ అదాలత్‌లో కేసులను

సామరస్యంగా పరిష్కరించుకోవచ్చు

- వార్త 8లో

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- నలుగురికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర -చిత్తూరు:

బంగారు పాళ్యం మండలం పాలారు ఫ్లై ఓవర్ వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఫ్లై ఓవర్ పై వెళుతున్న కారు ముందు టైరు పంచర్ కావడంతో అదుపుతప్పి డివైడర్ ను ఢీకొని బోల్తాపడడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

- వార్త 2లో

వైభవంగా... గురుపూజోత్సవ వేడుకలు

- 1500 మంది ఉపాధ్యాయులకు ఘన సన్మానం
- ముఖ్య అతిథులుగా తిరుపతి జిల్లా జెసి శుభం బన్సల్, చంద్రగిరి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు

2లో

అంతుచిక్కని దొంగతనాలు

(మొదటి పేజీ తరువాయి) రెండు నెలలు మునుపు గుడిపాల మండలం కేంద్రం నడిబొడ్డులో ఉన్నటువంటి ఎస్బిఐ ఏటిఎం ను ధ్వంసం చేసి చాకచక్యంతో 26 లక్షల నగదును దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన అప్పట్లో జిల్లాలో కలకలం రేపింది, గత ఆరు నెలలుగా మండలంలో వేరు వేరు ప్రాంతాలలో పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు చోరీకి గురి అయ్యాయి. గత వారం ఓ ఆర్మీ విశ్రాంత ఉద్యోగి ఇంట్లో 10 సవర్ల బంగారం చోరీ అయింది .ఇక సరిహద్దు ప్రాంతాలలో చైన్ స్నాచింగ్ ఎక్కువ అయ్యాయి. మండలంలో ప్రధాన రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలయినటువంటి చిత్తపార, గొల్లమడుగు, బొమ్మసముద్రం, నంగమంగళం, తిమ్మపల్లి, నారగల్లు, నిఘా యంత్రాలు (సి.సి.కెమరాలు) లేకపోవడం తో దీన్ని అణువుగా చేసుకుని దొంగల ముఠా పక్క ప్రణాళికతో చోరీలకు పాల్పడుతుంది. మండలంలో నగలతో పాటు ఏటీఎంలో చోరీ ఘటనపై దర్యాప్తు ముమ్మరం చేస్తామని గుడిపాల ఎస్సై రామ్మోహన్ తెలిపారు. పాల్పడుతున్నటువంటి ముఠాను చేవించడానికి ప్రత్యేకతలు చేపట్టామని సరిహద్దు ప్రాంతాలలో సీసీటీవీ కెమెరాలను సాధ్యమైనంత తొందరగా వారం రోజుల్లో పెడతామన్నారు, అలాగే దీనిపై కట్టుదిట్టమైన నిఘాని పెంచుతామన్నారు, అదేవిధంగా మండలంలోని వరుస దొంగతనాలు జరుగుతున్న ప్రాంతాలలో గల గ్రామాలలో ప్రజలను దొంగతనాల వల్ల అవగాహన కల్పించి అలాగే హైవే రోడ్డు పక్కన నిర్మానుష ప్రదేశాలలో గల ఇళ్లకు దుకాణాలకు వారి సొంత ఖర్చులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని అప్రమత్తంగా ఉండాలని అలాగే అవగాహన కల్పిస్తున్నామన్నారు, మండల పరిధిలో అనుమానాస్పద వ్యక్తులను గుర్తించినప్పుడు వెంటనే మాకు సమాచారం సెల్ నెంబర్ 9440796712 కు ఇవ్వాలని ప్రజలను ఎస్సై కోరారు .

గురుపూజోత్సవ వేడుకలు

విశాలాంధ్ర –తిరుపతి రూరల్ : గురు బ్రహ్మా గురు విష్ణు... గురు దేవో మహేశ్వరః... గురు స్సాక్షాత్ పరబ్రహ్మా... తస్మై శ్రీ గురవే నమః...అను శ్లోకాన్ని నిజం చేస్తూ... చంద్రగిరి నియోజకవర్గ స్థాయిలో పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను సన్మానించి గౌరవించుకోవడం మన బాధ్యతగా భావిస్తున్నానని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు.శనివారం తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో గురువులందరినీ ఒకే వేదికపై చూడడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన తెలిపారు.ఈ గురుపూజోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులు తిరుపతి జిల్లా జెసి శుభం బన్సల్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట ముని ప్రసాద్ (నాని)తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ ప్రతి మనిషికి తల్లి,తండ్రి తర్వాత గురువులే మార్గదర్శకులని కొనియాడారు.గురువు ఎటువంటి స్వార్థం లేకుండా... కులమత బేధాలు లేకుండా... నిస్వార్థంగా విద్యార్థులందరికీ ఒకే విధంగా చదువు చెపుతారు.రాజకీయ నాయకుడు కూడా గెలిచిన తర్వాత పార్టీలకతీతంగా... కుల మతాలకతీతంగా... నియోజకవర్గ అభివృద్ధి ముఖ్య లక్ష్యంగా పనిచేయాలని అప్పుడే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. సమాజాభివృద్ధిలో గురువుల పాత్ర కీలకమన్నారు దేశానికి విజ్ఞానవంతులైన భావి భారత పౌరులను అందించడంలో ఉపాధ్యాయుల గురుతర బాధ్యతని అన్నారు.పిల్లల బంగారు భవిష్యత్తులో ముఖ్య పాత్ర పోషించేది గురువులు మాత్రమే అని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లు విద్యా వ్యవస్థను మెరుగు పరచడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మెరుగు పరచడానికి ఒక దృఢ సంకల్పంతో మెరుగైన విద్యను పిల్లలకు అందించడానికి కృషి చేస్తున్న ఏకైక వ్యక్తి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అని అన్నారు. స్కూల్, కళాశాల మరియు విద్యావ్యవస్థలో ఏదైనా సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకువస్తే దగ్గరుండి సమస్యలను పరిష్కరించగలనని తెలిపారు. మేము కూడా ఒక గురువు దగ్గర విద్య అభ్యసించిన వారమేనని పరిపాలనలో ఎవరైనా ఏదేని తప్పు జరిగినా మాకు సూచనలు ఇవ్వాలని ఉపాధ్యాయులను కోరారు.మీరు నాకు ఓటు వేయబట్టే నేను ఇప్పుడు మీ ముందర నిలబడి ఉన్నానని గుర్తు చేశారు.మీకు ఎప్పుడు ఋణపడి ఉంటానని శిరస్సు వంచి గురువులకు నమస్కరించారు.అనంతరం చంద్రగిరి నియోజకవర్గ స్థాయిలో సుమారు 1500మంది పైగా ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులను దుశాలువాతో సత్కరించి మొమెంటోలు అందించి అభినందనలు తెలిపారు.ఇక్కడ ప్రతి ఒక్క ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు ఆయనే స్వయంగా సన్మానించడం విశేషం...ముఖ్య అతిథులుగా విచ్చేసిన తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు , జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ లను దుశ్శాలువాతో సన్మానించి పులివర్తి నాని కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఈఓ వి.శేఖర్,డిప్యూటీ డిఇఓ బాలాజీ,ఎంఈఓ లు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాణిపాకం రథోత్సవం

విశాలాంధ్ర–చిత్తూరు: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రథోత్సవ వేడుకలు సందర్భంగా కాణిపాకంలో అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. రథోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామివారి మూలవిరాట్ కు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సిద్ది బుద్ది సమేతుడైన శ్రీ వరసిద్ది వినాయక స్వామి ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి. తదుపరి రథంపై ఉంచారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, వివిధ సాంస్కృతి కార్యక్రమాల నడుమ స్వామివారు రథం పై కాణిపాకం పురవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. రథోత్సవ సందర్భంగా కాణిపాకం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారు రథంపై పురవీధుల విహరిస్తుండగా భక్తులు కర్పూర హారతులు ఇచ్చి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ ఈవో గురు ప్రసాద్, పలువురు ఉభయదారులు పాల్గొన్నారు.

ఫీజులు దోపిడీని అరికట్టండి

విశాలాంధ్ర – తిరుపతి : స్థానిక తిరుపతి బైరాగిపట్టేడలోని జివిస్కె భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మోహన్ బాబు విద్యాసంస్థలలో జరుగుతున్న అరాచకం పైన ప్రెస్మీట్ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివా రెడ్డి మాట్లాడుతూ తిరుపతి జిల్లా రంగంపేట లో వున్నా మోహన్ బాబు డ్రీమ్స్ యూనివర్సిటీ లో ప్రభుత్వం నిర్వహించిన ఎంసెట్ కౌన్సిలింగ్ ద్వారా మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ కోర్సులకు సీట్లు పొందిన ప్రతి విద్యార్థి దగ్గర ప్రతి ఏటా 20 వేల రూపాయల ఫీజును అధికంగా వసూలు చేస్తున్నారని ఫీజుల దోపిడీ అరికట్టాలని గతంలో ప్రభుత్వానికి చెప్పిన పట్టించుకోలేదన్నారు. డే స్కాలర్ గా వస్తున్న కళాశాలలకు వస్తున్న విద్యార్థుల కళాశాలకు సంబంధించిన మెస్ లోనే భోజనం చేయాలని, దానికోసం ప్రతి విద్యార్థి 20 వేల రూపాయలు ఫీజు చెల్లించాలని యాజమాన్యం నోటీసులు ఇవ్వడం చాలా దుర్మార్గమ న్నారు. బయటేమో విద్యార్థులకు మంచి విద్యను అందిస్తానని చెబుతున్న మోహన్ బాబు గారు పేద విద్యార్థుల దగ్గర లక్షలాది రూపాయలు ఎందుకు వసూలు చేస్తున్నారు సమాధానం చెప్పాలన్నారు. కట్టిన ఫీజులకు రసీదులు ఇవ్వకుండా , ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు కాకుండా ఇతర ఫీజులు ఎందుకు కట్టాలని తల్లిదండ్రులు పిల్లలు ఎవరైనా అడిగితే కళాశాలలో ఉన్నటువంటి బౌన్సర్లతో కొట్టించడం, ప్రొఫెసర్ తో మాట్లాడి వారిని ఫెయిల్ చేయడం వంటి బ్లాక్ మెయిల్‌కి మోహన్ బాబు గారు పాల్పడుతున్నారన్నారు. మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఫీజుల దోపిడీ అక్రమాలపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రెగ్యులేషన్ కమిటీతో విచారణ చేయించి విద్యార్థులకు న్యాయం చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారిని డిమాండ్ చేశారు . మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై ఎపిసిటిఈ కి ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తామని, ప్రభుత్వం పట్టించుకోకపోతే విద్యార్థులు తల్లిదండ్రులతో కలుపుకొని మోహన్ బాబు విశ్వవిద్యాలయాన్ని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు .ఈ సమావేశం లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్, జిల్లా అధ్యక్షులు నవీన్ కుమార్, చిన్న, వినయ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

(మొదటి పేజీ తరువాయి) ఇదే మండలం మొగిలి ఘాటు వద్ద శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగి ఏడు మంది చనిపోగా మరి 20 మంది తీవ్రంగా గాయపడిన తెలిసింది. ఈ ఘటన జరిగి 24 గంటలు కాకమునుపే మరో ప్రమాదం జరగడం చర్చనీయాంశం అయింది. చిక్కబల్లాపూర్ కు క చెందిన 6 మంది కంచికి కారులో వెళ్తుండగా మార్గమధ్యమైన బంగారుపాలెం మండలం పాలరు ఫ్లైఓవర్ వద్ద కారు బోల్తాబడంతో అందులో ఉన్న గంగయ్య, లక్ష్మి, లు అక్కడికక్కడే మృతిచెందగా, శ్రీనివాస మూర్తి, తంబుజా, సుజాత, ధరణి లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

థియేటర్లో కత్తిపోట్ల కలకలం

(మొదటి పేజీ తరువాయి) వ్యక్తం అవుతున్నది. థియేటర్లో సినిమా జరుగుతున్న సమయం లోనే కావ్య, లవర్ కార్తీక్ విషయం తెలిసిన వెంటనే థియేటర్‌లో ఉన్న లోకేష్ ను కత్తితో పొడవడం జరిగింది. అక్కడ నుంచి కత్తి దాడిలో గాయపడిన లోకేష్ సినిమా థియేటర్ వద్ద బయటకు రావడంతో సినిమా థియేటర్ సిబ్బంది అనుమానం వచ్చి ఈస్ట్ పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఈస్ట్ సిఐ మహేశ్వర్ రెడ్డి, ఎస్సై నాగేంద్రబాబు సంఘటన స్థలానికి సిబ్బంది వెళ్లి వెంటనే కత్తిపోట్లకు గురైన లోకేష్ కు మెరుగైన చికిత్స కోసం రుయా హాస్పిటల్ కు తరలించి లోకేష్ కు ఆపరేషన్ చేయిస్తున్నారు. అయితే యువకుడికి ఎటువంటి ప్రాణాపాయం లేదు. ఈ సంఘటనపై సీసీ ఫుటేజ్ లను పరిశీలించారు. ఈ సంఘటనకు సంబంధించి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలియజేశారు. దీనిపై సమగ్ర విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వివరించారు.

రక్త కణాలు ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి

– ప్రముఖ రక్త సంబంధిత వైద్య నిపుణులు డాక్టర్ పి.ప్రభు

విశాలాంధ్ర – తిరుపతి : రక్తం నాలుగు ప్రధాన భాగాలతో కూడిన ఒక ముఖ్యమైన ద్రవం ప్లాస్మా,ఎర్ర రక్త కణాలు,తెల్ల రక్త కణాలు, ప్లేట్‌లెట్లు ప్రతి ఒక్కటి మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెన్నై అపోలో హాస్పిటల్ ప్రముఖ రక్త సంబంధిత వైద్య నిపుణులు, డాక్టర్ పి.ప్రభు తెలిపారు.ఎర్ర రక్త కణాలు (ఎరిథ్రోసైట్లు):ఈ కణాలు ఊపిరితి త్తుల నుండి శరీర కణజాలాలకు ఆక్సిజన్‌ను తీసుకువె ళతాయి మరియు ఊపిరితిత్తుల కోసం కార్బన్ డయాక్సైడ్ను తిరిగి ఊపిరితిత్తులకు తిరిగి పంపు తాయి.ఎర్ర రక్త కణాలలో కీలకమైన ప్రోటీన్ అయిన హిమో గ్లోబిన్ ఈ ప్రక్రి యకు కీలకం.తెల్ల రక్త కణాలు (ల్యూకో సైట్లు):మన శరీరానికి రక్షణగా, తెల్ల రక్త కణాలు అంటువ్యా ధుల నుండి రక్షిస్తాయి మరియు రోగనిరోధక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయ పడతాయి. ఆక్రమణదారులతో పోరాడటానికి వివిధరకాలతెల్ల రక్త కణాలు కలిసి పనిచేస్తాయి.

ప్లేట్‌లెట్స్ (థ్రాంబో సైట్లు):రక్తం గడ్డకట్టడానికి అవసరం, ప్లేట్‌లెట్‌లు గాయపడిన ప్రదేశాలలో గడ్డకట్టడం మరియు రక్తస్రావం ఆపడం కోసం సేకరించబడతాయి.

సాధారణహెమటోలాజికల్వ్యాధులు: ఇమ్యూన్ థ్రోంబోసైటోపెనియా స్వయం ప్రతిరక్షక రుగ్మత తక్కువ ప్లేట్‌లెట్ కౌంట్ మరియు పెరిగిన రక్తస్రావం ప్రమాదానికి దారితీస్తుంది, తేలికపాటి గాయాల నుండి తీవ్రమైన రక్తస్రావం వరకు లక్షణాలు ఉంటాయి. రక్తహీనత: ఎర్ర రక్త కణాలు తగ్గే ఈ పరిస్థితి. పోషకాహారంతో సహా అనేక కారణాలు ఉన్నాయి. ఇది ఎముక మజ్జ వ్యాధి వల్ల కావచ్చు లేదా ప్లీహములో పెరిగిన విధ్వంసం వల్ల కావచ్చు.బ్లీడింగ్ డిజార్డర్స్: తక్కువ ప్లేట్‌లెట్స్ మరియు కోగ్యులేషన్ ప్రోటీన్ లోపం ఉన్న రోగిలో అధిక రక్తస్రావం కనిపించవచ్చు.అక్యూట్ మైలోయిడ్ లుకేమియా అక్యూట్ ప్రోమిలో సైటిక్ లుకేమియా అక్యూట్ లింఫోబ్లాస్టిక్ లుకేమి యా: ఈ ఉగ్రమైన రక్త క్యాన్సర్‌లకు తక్షణ చికిత్స అవసరమ వుతుంది మరియు తరచుగా అలసట, అంటువ్యాధులు మరియు సులభంగా గాయాలతో ఉంటాయి. మైలోడిస్ప్లాస్టిక్ సిండ్రోమ్స్ రక్తహీనత, ఇన్ఫెక్షన్లు మరియు రక్తస్రావానికి దారితీసే, పనిచేయని రక్త కణాలకు దారితీసే రుగ్మతల సమూ హం. సాధారణంగా వృద్ధుల వ్యాధి.మల్టిపుల్ మైలోమా:ఎముక మజ్జలోని ప్లాస్మా కణాల క్యాన్సర్, ఎముక నొప్పి, రక్తహీనత మరియు మూత్రపిండాల సమస్యలతో సంబంధం కలిగి ఉంటుంది.

మెనోరాగియా మరియు పునరావృత గర్భస్రావాలు:భారీ ఋతు రక్తస్రావం మరియు పునరావృత గర్భస్రావాలు సరైన రోగనిర్ధారణ మరియు నిర్వహణ అవసరమయ్యే అంతర్లీన రక్త రుగ్మతలను సూచిస్తాయి. **హిమోగ్లోబినోపతీస్:**సికిల్ సెల్ డిసీజ్ మరియు తలసేమియా వంటి రుగ్మతలు హిమోగ్లోబిన్ యొక్క నిర్మాణం మరియు పనితీరును ప్రభావితం చేస్తాయి, దీని వలన ముఖ్యమైన ఆరోగ్య సవాళ్లకు కారణమవుతుంది.

అప్లాస్టిక్ అనీమియా:ఎముక మజ్జ తగినంత రక్త కణాలను ఉత్పత్తి చేయడంలో విఫలమైన అరుదైన కానీ తీవ్రమైన పరిస్థితి, ఇది అలసట, అంటువ్యాధులు మరియు రక్తస్రావం దారితీస్తుంది. క్రానిక్ లింఫోసైటిక్ లుకేమియాతెల్ల రక్త కణాలను ప్రభావితం చేసే నెమ్మదిగా పురోగమిస్తున్న క్యాన్సర్, తరచుగా వాపు శోషరస కణుపులు, అలసట మరియు తరచుగా ఇన్ఫెక్షన్లతో ఉంటుంది.పాలీసైథెమియా వెరా: అధిక ఎర్ర రక్త కణాలు రక్తాన్ని చిక్కగా చేసే రుగ్మత, గడ్డకట్టే ప్రమాదాన్ని పెంచుతుంది.అధిక తెల్ల రక్త కణాలు మరియు ప్లేట్‌లెట్‌లు కూడా ఎముక మజ్జ సమస్యను సూచిస్తాయి.

‘రాస్’చే నిర్విరామంగా పశు వైద్య సేవలు : సంచాలకులు వి. నాగరాజు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : రాష్ట్రీయ సేవా సమితి (రాస్)చే నిర్విరామంగా పశువైద్యసేవలు అందిస్తున్నట్లు పొదుపు సంఘాల సంచాలకులు వి. నాగరాజు తెలిపారు. రాష్ట్రీయ సేవా సమితి(రాస్) ప్రధాన కార్యదర్శి ఎస్ .వెంకట రత్నం ఆదేశానుసారం, పొదుపు సంఘాల సంచాలకులు వి. నాగరాజు సూచనల మేరకు రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ద్వారా రేణిగుంట మండలం, అన్నాస్వామి పల్లిలో శనివారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఆ గ్రామ పంచాయితీ ప్రెసిడెంట్ ఎం.సుశీల ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేష్ మాట్లాడుతూ! రాస్ మహిళల కుటుంబాలకు కరకంబాడి పరిసర గ్రామాలలో విధిగా ఉచిత పశువైద్య శిబిరాల నిర్వహణతో పాటు, ప్రతినిత్యం సమస్యలున్న రైతులు ఫోను చేసిన వెంటనే వారి ఇండ్లకు నేరుగా వెళ్లి వైద్య సేవలను ఉచితముగా అందించడం జరుగుచున్నదని తెలిపారు. ఈ శిబిరాన్ని రేణిగుంట ఏరియా వెటర్నరీ వైద్యాధికారి స్రవంతి వారి బృంద సహకారంతో నిర్వహించడం, ఈ శిబిరానికి అన్నాస్వామి పల్లి, పరిసర గ్రామ ప్రాంతాల రైతులు తీసుకువచ్చిన పశువులకు, దూడలకు, జీవాలకు ఈ వాతావరణానికి ఎటువంటి సమస్యలు వస్తు న్నాయి, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను, సూచన లను తెలియజేసి ,వాటి ఆరోగ్యపరంగా అన్ని పరీక్షలు చేసి తగిన సూదులు- మందులు ఉచితముగా అందించి, వచ్చిన ప్రతి పశువుకి ,జీవానికి పురుగుల మందు తాగించి, పిడుదులకు మందును స్ప్రే చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిబ్బంది గిరిప్రసాద్, అన్బలగన్ , ఇందుమతి , నాగమణి, స్వాతి, శంకరయ్య, గోపాల మిత్ర మునిశేఖర్ క్లస్టర్ లీడర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడి మురళికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం మన్నసముద్రం గ్రామానికి చెందిన గుమ్మడి మురళికి శనివారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ఎక్స్ లెన్సు అవార్డు ప్రదానం చేశారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 137వ జయంతిని పురస్కరిం చుకొని కర్ణాటక, తమిళనాడు, రెండు తెలుగు రాష్ట్రాలలో చేపట్టిన సర్వే ఆధారంగా గుమ్మడి మురళిని అవార్డుకు ఎంపిక చేశారు. తిరుపతి విశ్వం హై స్కూల్ వేదికగా జరిగిన కార్యక్ర మంలో సర్వేపల్లె రాధాకృష్ణన్ మనవడు డాక్టర్ జి. సుబ్రమణ్యంశర్మ చేతుల మీదుగా గుమ్మడి మురళి ఈ అవార్డు అందుకున్నారు. విద్యారంగం, సామాజిక సేవా రంగంలోనూ మురళి చేసిన కృషిని గుర్తించిన యువతేజం ట్రస్ట్, కలాం విజన్ ట్రస్ట్ వారు ఈ అవార్డు ను అందించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత గుమ్మడి మురళి మాట్లాడుతూ... సనాత న ధర్మాన్ని పరంపరాగతంగా పరిరక్షిస్తున్న ఆ గురుదేవులను స్మరించుకుంటూ... నేటి పిల్లలను పావన నవజీవన బృందావన నిర్మాతలుగా, విద్యావేత్తలుగా తీర్చిదిద్దడానికి, ఘన మైన అడుగులు వేయటానికి ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఆకాంక్షించారు.

నేటి నుంచి తిరుపతి జిల్లాలో మెక్సికో బృందం పర్యటన

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: రాష్ట్రంలో రైతు సాధికార సంస్థ “ఏపీసీఎన్ఎఫ్” (ఆంధ్ర ప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం) ద్వారా అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించేందుకు మెక్సికో దేశ ప్రతినిధి బృందం ఈ నెల 15వ తేదీ నుంచి మూడు రోజుల పాటు తిరుపతి జిల్లాలో పర్యటించనుంది. మెక్సికో ప్రభుత్వం అమలు చేస్తున్న ‘ప్రొడక్షన్ ఫర్ వెల్ బీయింగ్’ కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్న తొమ్మిది మంది సభ్యులతో కూడిన ఈ బృందంలో మెక్సికో ప్రభుత్వ ప్రతినిధి బృందంతో పాటు ప్రజా సంస్థల తరపున పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, రైతులు కూడా ఉన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను క్షుణ్ణంగా అర్థం చేసుకొని తమ దేశంలో ఈ మోడల్ ను అమలు చేయాలనే ఉద్దేశ్యంతో ఈ బృందం పర్యటిస్తోంది. మెక్సికో ప్రభుత్వం తరపున ఏరియా డైరెక్టర్ డియాజ్ మరియా నేటివిటీ నేతృత్వంలో పర్యటించనున్న ఈ బృందం తొలుత ఈ నెల 15వ తేదీన తిరుపతిలోని ఓ హోటల్‌లో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ విజయ్ కుమార్ పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా ఏపీసీఎన్ఎఫ్ కార్యక్రమాలను మెక్సికో ప్రతినిధి బృందంకు వివరిస్తారు. అదే రోజు మధ్యాహ్నం నుంచి మూడు రోజుల పాటు తిరుపతి గ్రామీణ పరిధిలోని వేమూరు, సి.రామాపురం వైవీ పాలెం మండలంలోని ఉదయ్ మాణిక్యం, చిన్నగొట్టిగల్లు మండలంలోని చట్టేవారి పాలెం, రామచంద్రాపురం మండలంలోని కుప్పం బాదూర్, సీకే పల్లి గ్రామాలలో పర్యటించి వేర్వేరు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలలో రైతులు అనుసరిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను పరిశీలిస్తారు.

సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోండి

- 12వ అదనపు జిల్లా జడ్జ్ శ్రీనివాస్ నాయక్

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : లోక్ అదాలత్ లో తీర్పు..సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని కావున కక్షిదారులు సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్‌లను ఉపయోగించుకోవాలని 12వ అదనపు జిల్లా జడ్జ్ శ్రీనివాస్ నాయక్ కోరారు. హైకోర్టు ఆదేశాల మేరకు శ్రీకాళ హస్తి పట్నంలోని కోర్ట్ ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ లోక్ అదాలతో ఇచ్చే తీర్పు సుప్రీంకోర్టు తీర్పుతో సమానం అన్నారు, దీనికి తిరిగి అప్పీల్ లేదని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకో వాలని పిలుపునిచ్చారు. అలాగే కోర్ట్ యందు పెండింగ్ లో ఉన్న అన్ని రకాల రాజీపడని క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటార్ ప్రమాద పరిహార కేసులు, లేబర్ కేసులు, సివిల్ కేసులు, కోర్టు వరకు వెళ్లని రాజీ పడదగిన తగాదాలు లోక్ అదాలత్ తో పరిష్కరించుకోవచ్చునని చెప్పారు. లోక్ అదాలత్ అవార్డు అప్పీలు లేని అంతిమ తీర్పు అని తెలిపారు. నేడు లోక్ అదాలత్‌లో ఇరుపక్షాల కక్షిదారులకు న్యాయం జరిగే విధంగా కొన్ని కేసులను సత్వర తీర్పు ఇచ్చామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ బేబీ రాణి, జూనియర్ సివిల్ జడ్జ్ క్రిష్ణప్రియ, అన్ని శాఖల ఉన్నతాధికారులు, బ్యాంక్ సిబ్బంది, పారా లీగల్ వాలంటరీలు, కోర్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు, మంత్రి రవీంద్ర చిత్ర పటాలకు పాలాభిషేకం

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరోను రద్దు చేయడంపై ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి కొల్లు రవీంద్ర చిత్ర పటాలకు స్థానిక కలెక్టరేట్‌లో క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరిండెంట్లు, జానకిరామ్, శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ పరస్పరం అభినందనలు తెలియజేసుకున్నారు. ఇన్స్పెక్టర్లు సుబ్బారెడ్డి, శ్రీహరి, భీమలింగ, సబ్ ఇన్స్పెక్టర్లు శ్రీమతి భాగ్య లక్ష్మి, అఖిల మహేంద్ర, సతీష్, నవీన్ బాబు, రామకృష్ణ శాస్త్రి, అశోక్,జయశంకర్,హెడ్‌కానిస్టేబుల్స్,కానిస్టేబుల్స్‌పాల్గొన్నారు.

ఆదిశంకరాలో కోడ్ క్రాఫ్టార్స్ క్లబ్ ప్రారంభం

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కలశాలలో విద్యార్థులలో ఉపాధి , నైపుణ్యా లను పెంపొందించుటకు కోడ్ క్రాఫ్టార్స్ క్లబ్ ను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా కలశాల ప్రిన్సిపాల్ వేణు మాధవ్ మాట్లాడుతూ ఈ క్లబ్ వలన విద్యార్థులలో కోడింగ్ నైపుణ్యా లను పెంపొందించి వారి ఉన్నత భవిష్యత్ కు బాటలు వేస్తుంది అన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది రాజయ్య, ఇమ్మానుయేల్,పద్మావతి,ఏవోరాజయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు విశ్రాంత ఉద్యోగి విరాళం

విశాలాంధ్ర - గూడూరు : విజయవాడ వరద బాధితుల సహాయార్థం కొరకు గూడూరు పట్టణంలోని మాళవ్య నగర్‌కి చెందిన, రిటైర్డ్ అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ మద్దూరు రామ్ ప్రసాద్ 25 వేల రూపాయల చెక్కును గూడూరు శాసన సభ్యులు పాశిం సునీల్ కుమార్‌కి అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గూడూరు దాతలకు పుట్టిన ఇల్లు అని కొనియాడారు.వరద బాధితులకు సహాయం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ , తిరుపతి పార్లమె ంటు అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, మాజీ కౌన్సిలర్ తిరుపతి పార్లమెంటు క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు తాతపూడి ఇశ్రాయేల్ కుమార్, గూడూరు నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు, ఎం.డి. అబ్దుల్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపిలో చేరి వికసిత్ భారత్ నిర్మాణానికి సహకరించండి

చంద్రగిరిలో ముమ్మరంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం

విశాలాంధ్ర - చంద్రగిరి: భారతీయ జనతా పార్టీలో చేరి వికసిత్ భారత్ నిర్మాణానికి సహకరించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్. జగదీశ్వర్ నాయుడు పిలుపునిచ్చారు. శనివారం సీనియర్ నాయకులతో కలిసి చంద్రగిరి టవర్ క్లాక్ సమీపంలో ముమ్మరంగా సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అభివృద్ధి చెందిన భారత్ (వికసిత్ భారత్) నిర్మాణం మోడీ ప్రభుత్వ విధానం మాత్రమే కాదు బిజెపి లక్ష్యం కూడా అన్నారు. ఈ లక్ష్యం దిశగా సమర్థుడి నాయకత్వంలో దేశం సరైన పథంలో వేగంగా ముందుకు సాగుతుందని కులమతాలు ప్రాంతాలకు అతీతంగా యావత్తు దేశ ప్రజల నుంచి అభివృద్ధి చెందిన భారత్ కు విశేష మద్దతు వస్తుందన్నారు. బిజెపికి మద్దతు ఇవ్వండి బిజెపి సభ్యత్వం తీసుకుని మాతో చేతులు కలపండి బిజెపి ఎంత శక్తివంతం అయితే అభివృద్ధి చెందిన భారత్ కల అంత త్వరగా సాకారం అవుతుందని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి సభ్యత్వ ప్రముఖ్ కె.వెంకట ముని, గాలి పుష్పలత, టి. సుబ్రహ్మణ్యం యాదవ్, హరినాథ్ రెడ్డి, మునిగంగి రెడ్డి, దొరస్వామి, నరేష్ కుమార్ నాయుడు, మణి యాదవ్, తిలక్, మునెయ్య, ప్రభాకర్ నాయుడు, జనార్దన్ నాయుడు, లక్ష్మణ్, చైతన్య, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భాకరాపేట ఘాట్ రోడ్డులో ప్రమాదాల నివారణకు

వెంటనే చర్యలు చేపట్టాలి

- అధికారులతో కలిసి ఘాట్ రోడ్డును పరిశీలించిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

విశాలాంధ్ర - చంద్రగిరి: అధికారులు కలిసికట్టుగా పనిచేసి రోడ్డు ప్రమాదాల నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలని ఎంఎల్ఏ పులివర్తి నాని కోరారు. చంద్రగిరి మండలం, భాకరాపేట ఘాట్ రోడ్ లో జరిగిన రోడ్డు ప్రమాదం దారుణమని ఎక్కడ నుంచో వచ్చి ఇక్కడ ప్రాణాలను కోల్పోతు న్నారని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆవేదన వ్యక్తం చేశారు. భాకరా పేట ఘాట్ కనుమ రహదారిలో ప్రమాదాలు నిత్య కృత్యమయ్యాయి. ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ ఏదో ఒక ఘటన జరుగుతూనే ఉన్నదని ఎమ్మెల్యే దృష్టికి అధికారులు తీసుకెళ్లడం జరిగింది. తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్న భాకరాపేట ఘాట్ నందు శుక్రవారం పోలీసులు, జాతీయ రహదారి శాఖ అధికారులతో నాని సమీక్ష నిర్వహించారు. యర్రావారి పాలెం, చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ అందిస్తున్న సబ్సిడీ “కందులు” పంపిణీ కార్యక్రమాన్ని పూర్తిచేసుకుని తిరుగు ప్రయాణంలో భాకరాపేట ఘాటు వద్ద గురువారం టమేటా ల కంటైనర్ అదుపుతప్పి కారుపై పడటంతో ముగ్గురు మృతి చెందటం ఇద్దరు తీవ్రంగా గాయపడటం ఎంతో బాధాకరమన్నారు. వెంటనే రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు అధికారులతో ఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదాల నివారణ కొరకు తీసుకోవాల్సిన చర్యలు గురించి అధికారులతో కలిసి ప్రమాదాలు జరిగే ప్రధానమైన మలుపులను పరిశీలించారు. ప్రమాదాలు జరిగేందుకు కారణాలు, వాటికి తీసుకోవలసిన చర్యలు, అందుకోసం ప్రభుత్వం నుంచి కావలసిన అనుమతులు తదితర అంశాలపై అధికారులతో కలిసి చర్చించారు. వాహనదారులు రోడ్డు అవగా హన లేకపోవడంతో మరి కొందరు అధిక లోడ్డుతో వాహనాన్ని కంట్రోల్ చేయలేక రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలను కోల్పోతున్నారని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సి.మల్లవరం జంక్షన్ నుండి పీలేరు వరకు బైపాస్ రోడ్డు పూర్తి అయితే రోడ్డు ప్రమాదాలను అరికట్టవ చ్చని ఎంఎల్ఏ తెలిపారు. కొందరు భూ యజమానులు తమ భూములకు అధిక మొత్తం కొరకు కోర్టును ఆశ్రయించడంతో రహదారి పెండింగ్లో ఉందని అధికారులు తెలిపారు. అనంతరం అటవీశాఖ నుండి అనుమతులు లభించాల్సి ఉందని తెలిపిన ఎన్.హెచ్ అధికారులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయవలసిందిగా తిరుపతి డిఎఫ్ఓ సతీష్ కుమార్ ని ఎమ్మెల్యే కోరారు. త్వరితగతిన పనులను చేపడితే ప్రమాదాలు నివారించిన వారమవుతామని ఎంఎల్ఏ అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారు లు, జాతీయ రహదారుల శాఖ ఇంజనీర్లు, అటవీ శాఖ అధికారులు, నిపుణులు పాల్గొన్నారు.

చిత్తూరు కమిషనర్ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-చిత్తూరు: చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా నియమితులైన పి.నరసింహ ప్రసాద్ శనివారం నగరపాలక కార్యాలయానికి చేరుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా పుంగనూరు కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న నరసింహ ప్రసాద్‌ను చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా నియమించిన సంగతి తెలిసిందే. అయితే ఈ నెల 4వ తేదీన చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా చార్జ్ తీసుకున్న ఆయన నేరుగా విజయవాడ వరదల సహాయ చర్యల విధుల్లో చేరారు. అక్కడ విధులు ముగియడంతో శనివారం ఉదయం నగరపాలక సంస్థ కార్యాలయాన్ని చేరుకున్న నూతన కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ను నగరపాలక అధికారులు స్వాగతం పలికారు. అనంతరం కమిషనర్ ఛాంబర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ అసిస్టెంట్ ఉమామహేశ్వర రెడ్డి, ఆర్ఐలు అదామ్, గోవర్ధన్, యుడీఆర్ఐ అమర్నాథ్ రెడ్డి, ఇతర ఉద్యోగులు పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు కూనాటి సురేష్‌కు సన్మానం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు కూనాటి సురేష్ ను ఘనంగా సన్మానం చేశారు. చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని అధ్యక్షతన శనివారం నియోజకవర్గ స్థాయి గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. చంద్రగిరి నియోజకవర్గంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరినీ ఈ సందర్భంగా సన్మానించారు. ఇందులో భాగంగా ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కూనాటి సురేష్ ను కూడా ప్రత్యేకంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని, తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.శేఖర్, తిరుపతి డివిజను ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల వినియోగం పెరగాలి

విశాలాంధ్ర-గంగవరం: గ్రంథాలయాల వినియోగం పెరిగినప్పుడే విజ్ఞానదాయక మైన, విలువలతో కూడిన సమాజం ఏర్పడుతుందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి.తులసినాథం నాయుడు అన్నారు. శనివారం కళామందిరంలో గ్రంథాలయోద్యమ పితా మహులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ ఫోన్ వినియోగం పెరిగిన తరువాత పుస్తకాలు చదవడం బాగా తగ్గిపోయిందన్నారు. దీనితో విలువల పతనం ప్రారంభమయిందన్నారు. బాల్యం నుంచే పుస్తకాలు చదివే అలవాటును ప్రోత్సహించాలన్నారు. ఆంధ్రులలో తొలి రాజకీయఖైదీ గా పేరు పొందిన హరి సర్వోత్తమరావు స్వాతంత్ర్య సమరయోధుడిగా, పత్రికారచయితగా, సాహితీకారుడిగా తెలుగు జాతికి విశేష సేవలందించాడన్నారు. ఎడిటర్ అనే ఆంగ్ల పదానికి 'సంపాదకుడు' అనే తెలుగు పదాన్ని ప్రవేశ పెట్టిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, ఎన్‌జిఓ నాయకులు ఆనందబాబు, గుణశేఖర్ దేవనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలోని భవనాలను పరిశీలించిన న్యాయమూర్తి

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాల ప్రాంగణంలో శిథిలావస్థకు చేరుకున్న పలుభవనాలను తిరుపతి రెడ్ శాండల్ న్యాయమూర్తి శ్రీకాంత్ పరిశీలిం చారు. శనివారం ఆయన బాలుర గురుకుల పాఠశాలకు చేరుకొని అక్కడ మౌలిక వసతులుపై పరిశీలించడం జరిగింది. ఈ నేపథ్యంలో గురుకుల పాఠశాల ప్రాంగణంలో శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారిన అయిదారు భవనాలను న్యాయమూర్తి శ్రీకాంత్ పరిశీలిం చారు. అనంతరం బాలుర గురుకుల వసతి భవనంలో చోటు చేసుకున్న పలుచోట్ల పగుళ్లను పరిశీలించి వీటి మరమ్మతుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం న్యాయమూర్తి శ్రీకాంత్ విద్యార్థులను పలకరించారు. భోజనం నాణ్యత, విద్యా బోధన తదితర అంశాలను అడిగి తెలుసు కున్నారు. అలాగే ఏవైనా సమస్యలు ఉన్నాయా అంటూ విద్యార్థులను ప్రశ్నించారు. ఈ కార్యక్ర మంలో ఉపాధ్యాయుల సురేష్, అబ్దుల్, స్థానిక న్యాయవాదులు డి.వెంకటేశ్వర్లు, వేలు, వినోద్, గీత, అఖిల్, మునిశేఖర్ తదితరులు ఉన్నారు.

ఆర్వో వాటర్ ప్లాంట్‌కు భూమి పూజ

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా సూళ్లూరుపేట లోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో స్వర్గీయ ఇసనాక హర్షవర్ధన్ రెడ్డి పుట్టిన రోజు జ్ఞాపకార్థంగా వారి కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి ఆర్థిక సహాయంతో, సులూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ మాజీ ఎంఎల్ఏ నెలవల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్‌కు భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇసనక వాణిశ్రీ, తెలుగుదేశం పార్టీ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు ఆకుతోట రమేష్, మాధవ నాయుడు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 49 కేసులు పరిష్కారం

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్లో 49 కేసులు పరిష్కారమయ్యాయి. ఇందుకు గాను 51,35,594 రూపాయలను రికవరీ చేయడం జరిగింది. తిరుపతి రెడ్ శాండల్ న్యాయమూర్తి శ్రీకాంత్ అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కక్షిదారుల రాజీతో న్యాయమూర్తి శ్రీకాంత్ పలు కేసులను పరిష్కరించారు. ఇందులో భాగంగా ప్రామిసరీ నోటు, భూములు, నగదు రికవరీకి సంబంధించి 8 కేసులు గాను 26,31,454 రూపాయలు, ఎనిమిది చెక్ బౌన్స్ కేసులో 22,40,000 రూపాయలు, మరో 16 అడ్మిషన్ కేసుల్లో 98,000 రూపాయలు, భార్యాభర్తల కేసు ఒకటి, భరణానికి సంబంధించి ఒకటి, ఐపిసి 15 కేసులు ఉన్నట్టు కోర్టు అధికారులు వివరించారు. ఈ లోక్ అదాలత్ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు డి.వెంకటేశులు, చంద్రశేఖర్, పార్థీపన, గోపీనాథ్, పిడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

17న తిరుమలలో అనంత పద్మనాభ వ్రతం

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: తిరుమలలో సెప్టెంబరు 17వ తేదీన అనంత పద్మనాభ వ్రతాన్ని టీటీడీ ఘనంగా నిర్వహించనుంది. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వారును ఆలయం నుండి ఊరేగింపుగా శ్రీభూవరాహస్వామి ఆలయం పక్కనున్న స్వామివారి పుష్కరిణి చెంతకు అర్చకులు ఆగమోక్తంగా తీసుకువెళ్లి పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్వామి పుష్కరిణిలో అభిషేకాదులు నిర్వహించి తిరిగి ఆలయానికి వేంచేపు చేస్తారు. కాగా అనంతుడు అనగా ఆదిశేషుడు. ఆదిశేషుడుపై అనంతపద్మనాభస్వామివారి అవతారంలో ఉన్న శ్రీమహావిష్ణువును ప్రార్థిస్తూ గృహస్థులు సౌభాగ్యంకోసం ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. శ్రీ మహావిష్ణువు అనంతకోటి రూపాలలో కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామి వారికి ఎంత ప్రాశస్త్యం ఉందో అదేవిధంగా శయన మూర్తిగా శ్రీ అనంత పద్మనాభస్వామికి అంతే వైశిష్ట్యం ఉంది. ప్రతి ఏటా ఈ పర్వదినాన దేశవ్యాప్తంగా ఉన్న 108 శ్రీ వైష్ణవ దివ్యక్షేత్రాలలో అనంత పద్మనాభ వ్రతం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తిరుమల 108 శ్రీ వైష్ణవ దివ్య దేశాలలో ప్రధానమైనది కావడంతో అనంత పద్మనాభ వ్రతాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించారు. తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలలో చివరి రోజున, వైకుంఠ ద్వాదశి, రథసప్తమి, అనంత పద్మనాభవ్రతం పర్వదినాలలో మాత్రమే చక్రస్నానం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఉన్నతాధికారులు, ఆలయ అర్చకులు పాల్గొంటారు.

నారాయణవనం మండల నూతన ఎస్పైని కలిసిన రాకేష్ కిరణ్

విశాలాంధ్ర-పుత్తూరు టౌన్: నారాయణ వనం నారాయణ వనం మండల నూతన ఎస్సైగా కె.రాజశేఖర్ రెడ్డి రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాకేష్ కిరణ్ శుక్రవారం సాయంత్రం ఎస్సైని మర్యాదపూర్వకంగా దుస్సాల్వతో సత్కరించి ఆయన్ని కలవడం జరిగింది అనంతరం మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సీనియర్ నాయకులు అన్న దొర మాజీ సర్పంచ్‌లు తిరువంగాడం పీజీ బాబు ప్రసాద్ సొరకాయల (పెద్దబ్బ) హెమచంద్ర రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ ఇండియన్ కార్మికుల నాయకుడు అశోక్ గోవింద స్వామి మంజీనాద్ గోకుల్ రజిని ముని రత్నం. మురళి కిరణ్ రత్నం మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని సేవలో బొజ్జల రిషితారెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం కైలాసగిరి కాలనీలో గల వినాయక స్వామిని శనివారం శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి దర్శించుకున్నారు. వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ఈమెకు ఘనంగా స్వాగతం పలికారు. అదేవిధంగా స్వామి వారి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇక్కడ బొజ్జల రిషితారెడ్డి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సన్నిధిలో కొడిముద్దలు పంపిణీ

విశాలాంధ్ర-చిట్టమూరు: మల్లంలో వెలసి ఉన్న స్వయంభు శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఆలయ ప్రాంగణంలో ధ్వజారోహనం కావించి కొడిముద్దలు పంపిణీని ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కామిరెడ్డి మునిశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు భాను ప్రకాష్ శర్మ వేదమంత్రోచరణల మధ్య భక్తులకు పంపిణీ చేయడం జరిగినది. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలలో భాగంగా 2వ రోజు ధ్వజస్తంభం వద్ద దోజరోహణం చేసి బ్రహ్మోత్సవాలకు సకల దేవతలకు పిలుపునివ్వడం జరుగుతుంది.అందులో భాగంగానే సంతానము లేని వారికి కొడిముద్దలు తింటే సంతానం కలుగుతుందని భక్తుల కోర్కెలు కోరుకొని కోర్కెలు నెరవేరుతాయని పురాతనముగా ఈ ఆలయంకి విచ్చేసిన భక్తులు చెప్పుంటారు శనివారం నిర్వహించిన కొడిముద్దల పంపిణీలో టిడిపి రాష్ట్ర యువత కార్యదర్శి కామిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యురాలు దువ్వూరు భారతమ్మ, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వివో శశాంక్, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం మాజీ చైర్మన్ కోదండరామిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డిలు పాల్గొని ముద్దలు స్వీకరించి స్వామివారికి మొక్కులు మొక్కుకున్నారు భక్తులు విరివిగా విచ్చేసి ఈ కార్యక్రమంలో పాల్గొని వారి కోర్కెలను మొక్కుకొని కొడి ముద్దులు స్వీకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వామివారికి వేద పండితులు పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు.

విజయవాడ వరద బాధితులకు ఆర్థికసాయం

విశాలాంధ్ర-నాయుడుపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సర్వం కోల్పోయిన విజయవాడ వరద బాధితులకు నాయుడుపేట వ్యాపారులు తమ ఆర్థిక సహాయం అందించారు. నాయుడుపేట పాన్ బ్రోకర్స్ అండ్ బులియన్ మర్చంట్ అసోసియేషన్ వారు రూ. 1,50,000, నాయుడుపేట క్లాత్ మర్చంట్ అసోసియేషన్ వారు ఒక లక్ష రూపాయల చెక్కులను సూళ్లూరుపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి లకు అందజేశారు. ఈ సందర్భంగా వారు నెలవల సుబ్రహ్మణ్యం విజయభాస్కర్ రెడ్డిలకు శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం నెలవల సుబ్రహ్మణ్యం, శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డిలు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వరదబాధితులను ఆదుకుంటూ ఆర్థికసహాయం అందించిన, పాన్ బ్రోకర్స్ అండ్ బులియన్ మర్చంట్స్ అసోసియేషన్, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సముద్రాల రమేష్ బాబు, కోటూరు సాయిరాం ప్రసాద్, పలువురు బంగారం, వస్త్రవ్యాపారులు పాల్గొన్నారు.

మహిళను కట్టేసి కొట్టిన దుర్మార్గులను శిక్షించాలి

విశాలాంధ్ర-పలమనేరు: కర్నూలు జిల్లా, పెద్ద కడబూరు మండలం, కల్లుకుంట గ్రామంలో దళిత మహిళను విద్యుత్ స్తంభానికి కట్టేసి కొట్టిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని జాతీయ మానవ హక్కులు మరియు అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా నాయకులు డి.వి. మునిరత్నం, మణి, పార్థసారథి డిమాండ్ చేశారు. అందులో భాగంగా శనివారం పలమనేర్ పట్టణంలో జాతీయ మానవ హక్కుల కార్యాలయము నందు గుర్రం సుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఈ విషయంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ అధ్యక్ష, కార్యదర్శులు సరస్వతి, సుమతి మాట్లాడుతూ కల్లుకుంట గ్రామంలో దళిత యువకుడు బీసీ సామాజిక వర్గానికి చెందిన అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్న పాపానికి అగ్రకుల పెత్తందారులు కన్నెర్ర చేసి అమ్మాయి కుటుంబీకులను రెచ్చగొట్టి దళిత మహిళపై దాడి చేయడమే కాకుండా కరెంటు స్తంభానికి తాళ్లతో కట్టేసి కొట్టడం దుర్మార్గమన్నారు. విషయం తెలుసుకున్న మండల పోలీసులు హుటాహుటిన గ్రామానికి వెళ్లి మహిళను ఆమె రెండో కొడుకును కాపాడగలిగారని, లేకుంటే అగ్రకుల అహంకారులు తల్లి బిడ్డను చంపేసేవారని ఘాటుగా విమర్శించారు. ఈ ఘాతుకానికి పాల్పడిన మానవత్వం లేని మృగాలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని, డిమాండ్ చేశారు. బాధితులను పోలీసులు కాపాడిన విధంగానే కేసు విచారణను కూడా నిష్పక్షపాతముగా, దుర్మార్గుల వెనుక రాజకీయ ప్రమేయం ఉన్న ఉపేక్షించకుండా దర్యాప్తు చేసి మూరు?లకు శిక్ష పడే విధంగా చూడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును నిర్వీర్యం చేసినందుకే దేశ, రాష్ట్రాల్లో బడుగు బలహీన మైనార్టీ వర్గాలపైన విపరీతమైన దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో దేవరాజులు, వినోద్ కుమార్, శివన్న, ఆనంద్, బాబు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నమే ఓనం

విశాలాంధ్ర-కుప్పం: కుప్పం నర్సింగ్ కాలేజీలో ఓనం పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిసిఎన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ డా. ఎన్.సునీల్ రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు అయన మాట్లాడుతూ ఓనం, కేరళ ప్రజలు 10 రోజుల పాటు ఆనందంతో చేసుకునే ఓ అద్భుతమైన పండుగ అని ఇది రాజు మహాబలి విజయంతో స్వదేశానికి రావడాన్ని సూచిస్తుంది అని తెలిపారు. కుప్పం నర్సింగ్ కాలేజీ విద్యార్థులు ఓనం సంబరాలను జరుపుకోవడం ఆనందంగా ఉన్నదని తెలిపారు. ఈ ఓనం పండుగ ప్రతి ఒక్కరి జీవితములో నూతనమయిన సంతోషాన్ని వెలుగును ఆనందాన్ని నింపాలని ఆశాభావం వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, కవాతులు నిర్వహించారు. పువ్వులను ఉపయోగించి ఎంతో అద్భుతంగా విద్యార్థులు ముగ్గులను కాలేజీ ప్రాంగణములో వేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కేరళ సాంప్రదాయ సాంస్కృతిక పోటీలలో గెలిపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ విమల జోసెఫ్, కుప్పం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ సుధారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ అన్ని కులాలను సమానంగా చూస్తారు

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

విశాలాంధ్ర-తిరుపతి: జనసేన అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు అన్ని కులాలు సమానంగా చూస్తారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. కులాలు కలిపే ఆలోచనా విధానం జనసేన విధానమని ఆయన చెప్పారు. బలిజ విద్యా సంస్థల ఆత్మీయ సమావేశం శనివారం మధ్యాహ్నం ఓ ప్రైవేట్ హోటల్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ అన్ని రంగాల్లో బలిజ సామాజికవర్గం రాణించాల్సి ఉందన్నారు. బలిజల్లోని పేద విద్యార్థులను చదివించడంలో మానవతా దృక్పథంతో విద్యా సంస్థల కరస్పాండెంట్‌లు వ్యవహరించాలని ఆయన కోరారు. తన వంతుగా జేఎంసి ట్రస్ట్ నుంచి పేద విద్యార్థులను ఆదుకునేందుకు సాయం చేస్తామని ఆయన చెప్పారు. రాజకీయాలను తిరగరాసే శక్తి విద్యాసంస్థలు యజమానులకు ఉందని ఆయన తెలిపారు. ఎన్నో ఒడుదుడుకులు ఎదుర్కొని రాజకీయాల్లో తనముద్ర వేసిన పవన్ కళ్యాణ్ కు తోడ్పాటు అందించి మీరంతా రాయలసీమలో జనసేన బలోపేతానికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యం, కాలేజీ కరస్పాండెంట్స్ రమణ, నరసింహులు, ఎస్వీ యూనివర్సిటీ డీన్ చెంగయ్య, మహేష్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

కుప్పం డాక్టర్లు భారీ విరాళం

విశాలాంధ్ర-కుప్పం: చరిత్రలో కనీవినని రీతిలో వరదలతో నష్టపోయిన విజయవాడ ప్రజలకు కుప్పం డాక్టర్లు అండగా నిలిచారు. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కుప్పం బ్రాంచ్ నుండి డా. సురేష్ బాబు, డా. ప్రశాంత్, డా. మంజునాథ్, డా. సుధీర్, డా. శివ ప్రకాష్ పలువురు వైద్యులు కలిసి 7,64,000 రూపాయలను విరాళంగా సి.ఎం వ్యక్తిగత సహాయకులు మనోహర్, తెదేపా అడ్వైజర్ నరేష్ చారి, మున్సిపల్ కౌన్సిలర్లు దాము, జాకీర్ లకు ఈ విరాళం ను అందవేశారు. ఈ డబ్బుతో 750 కుటుంబాలకు కొన్ని వస్తువులు ఒక కిట్ గా ఇవ్వనున్నట్లు తెలిపారు.

డాక్టర్ బీజే ప్రసాద్ ఆధ్వర్యంలో వైభవంగా గణపతి హోమం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని కైలాస్ గిరి కాలనీలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం ఎదుట రాష్ట్ర తెలుగు యువత మాజీ కార్యదర్శి, రిపబ్లిక్ క్లబ్ మాజీ కార్యదర్శి డాక్టర్ బీజే ప్రసాద్ దంపతుల ఆధ్వర్యంలో శనివారం వైభవంగా గణపతి హోమం నిర్వహించారు. అనంతరం కాలనీలోని పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ టౌన్ బ్యాంక్ చైర్మన్లు డీవీ నారాయణ, శెట్టిపల్లి సురేష్, మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు వాకిచర్ల గురప్ప శెట్టి, అన్వర్ బాషా, చిన్నా, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

తూగుండ్రం సమీపంలో ఇసుక లారీ పట్టివేత

విశాలాంధ్ర-గంగాధరనెల్లూరు: మండలంలోని తూగుండ్రం సమీపంలో ఇసుక అక్రమ తరలిస్తున్న లారీని పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. గంగాధరనెల్లూరు మండలం నీవానది ప్రాంతం నుండి ఇసుకను లారీలో అక్రమంగా తమిళనాడుకు తరలిస్తుండగా శుక్రవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ఆ ఇసుక లారీని మైన్స్ అధికారులకు స్వాధీనం చేసినట్లు తెలిసింది.

రాజనాలబండపై ప్రమాణాల జోరు

విశాలాంధ్ర-చౌడేపల్లి: సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాల బండ పై శనివారం ప్రమాణాల జోరు కొనసాగింది పుంగనూరు కు చెందిన భవాని 20 గ్రాముల నెక్లెస్ దొంగలించబడగా స్వామివారి మహిమలు తెలుసుకొని బంగారాన్ని భవాని ఇంటి ముందు పడేసి వెళ్లిపోయారు దీంతో దానిని తీసుకొని స్వామి పాదాల చెంత ఉంచి మరల తీసుకున్నారు రాజనాల బండపై ఎన్నడూ లేని విధంగా ప్రమాణాలు చేశారు తిరునాళ్లు వినాయక చవితి సందర్భంగా వాయిదా వేసుకుని వెళ్లినవారు శనివారం అధిక సంఖ్యలో బండకు చేరుకున్నారు రాష్ట్రం నుంచి కాకుండా ఇతర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో అనుమానితులు పోగొట్టుకున్న వారు తరలివచ్చారు కొందరు ప్రమాణం చేయగా మరికొందరు వాయిదా వేసుకుని వెళ్లారు నగదు నగలు పోగొట్టుకున్న వారి ఎక్కువగా కనిపించారు మదనపల్లి ప్రొద్దుటూరు బైరెడ్డిపల్లి కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు ప్రమాణాలు చేశారు ఉదయాన్నే ప్రధాన అర్చకుడు కృష్ణమూర్తి ప్రసన్న ఆంజనేయస్వామి లక్ష్మీ నరసింహ స్వాములకు శేష అభిషేకము అలంకరణ నిర్వహించారు పక్కనే ఉన్న శివాలయంలోను విశేష పూజలు జరిగాయి అత్యధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు టీటీడీ ఆధ్వర్యంలో పవిత్ర తీర్థప్రసాదాలు అందించారు ఈ కార్యక్రమంలో స్థానికులు భక్తులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు బొల్లిని మధు నాయుడు విరాళం

విశాలాంధ్ర-పుత్తూరు టౌన్: పుత్తూరు పట్టణంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు మొదటి విరాళంగా బొల్లిని జయరాం నాయుడు ఎనిమిదో వర్ధంతి సందర్భంగా అన్న క్యాంటీన్ ఏర్పాటుకు 25వేల రూపాయల చెక్కును నగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ కు శనివారం బొల్లిని మధు నాయుడు అందించారు. ఈ సందర్భంగా బొల్లిని మధు నాయుడు మాట్లాడుతూ తన తండ్రి బొల్లిని జయరాం నాయుడు జ్ఞాపకార్థం అన్నా కాంటీన్ కు విరాళం అందిస్తున్నట్లు తెలిపారు. పేదలకు తక్కువ ఖర్చుతో కడుపు నిండా అన్నం పెట్టాలన్న సంకల్పంతో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు తీసుకొచ్చిన ఈ కార్యక్రమంకు తన వంతు సహాయంగా ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌కి 25 వేల రూపాయలు నగదు అందించినట్లు తెలిపారు.

మిద్దె పైనుండి పడి మతిస్థిమితం లేని యువకుడు మృతి

విశాలాంధ్ర-తడ: మండల పరిధిలోని కొండూరు పంచాయతీ పులివెంద్ర గ్రామంలో మతిస్థిమితం లేని భీహార్‌కు చెందిన బాబులాల్ మర్మ్ము (30) అనే యువకుడు మిద్దె పై నుండి పడి తలకు తీవ్ర గాయాలు పాలై మృతి చెందిన సంఘటన శనవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. తడ ఎస్సై కొండప్ప నాయుడు సమాచారం మేరకు మాంబట్టు పారిశ్రామిక వాడలోని వీకేసీ పరిశ్రమ లో బీహార్ రాష్టానికి చెందిన మనోహర్ వాలియా అనే అతను గత కొంత కాలంగా పనిచేస్తున్నాడు.అతని బావ మరిది బాబులాల్ ముర్మ్ము ను తను పనిచేస్తున్న వీకేసీ పరిశ్రమ లోనే శుక్రవారం చేర్చగా బీ షిఫ్ట్ ముగించుకుని అతని మామ నివాసముంటున్న పులివేంద్ర లో బాడుగ వున్న ఇంటికి రాత్రి 11 గంటలకు వచ్చాడని రాత్రి 3 గంటల సమయం లో మెలుకవ వచ్చిన అతని మామ బాబులాల్ మూర్మ్ము కనబడక పోవడంతో వెతికి చూడగా మతి స్థిమితం సరిగాలేని బాబూలాల్ సమిపం లోని కాదలూరు టౌన్ షిప్ లో నివాసం ఉంటున్న వారిపై రాళ్లతో దాడి చేసాడని అనంతరం వారి మామ నివాసం వున్న మిద్దె పై నుండి పడి గోడ తగిలి తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడని,మతిస్థిమితం లేని ఆ యువకుడు స్థానికులను రాళ్ల తో దాడి చేసే దృశ్యాలు సీసీటీవీ కెమెరాలలో రికార్డ్ అయి వున్నట్లు కనుగొన్నామని ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సిఐటియు చంద్రగిరి మండల కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-చంద్రగిరి: కార్మిక సమస్యలు పరిష్కారం కోసం సిఐటియు చంద్రగిరి మండల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్. జయచంద్ర, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వాణిశ్రీ, జిల్లా ఉపాధ్యక్షుడు గండికోట నాగా వెంకటేష్, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గండికోట చిన్నబాబు హాజరయ్యి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్మికులు సమస్యల పైన నిరంతరం సిఐటియు పోరాట నిర్వహిస్తుందని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి అన్నారు. స్కీం వర్కర్లను కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు తక్షణమే వేతనాలు పెంచాలని ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటి మండల కమిటీని ఎంపిక చేసారు. కన్వీనర్‌గా యుగంధర్, కో కన్వీనర్ గా వాణిశ్రీ, నాగభూషణమ్మ, కృష్ణమ్మ, సుహాసిని నవనీత, ముని రాజమ్మ, చిట్టిబాబు, ప్రకాష్, నరసింహ, సోను, శ్రీధర్, వేదవతి మరో 5మందిని మండల కమిటీ సభ్యులు గా ఎన్నుకున్నారు.

ఎమ్మెల్యే ఆదిమూలం కోలుకోవాలని ఆలయాల్లో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-పిచ్చాటూరు: గౌరవనీయులు సత్యవేడు శాసన సభ్యులు కోనేటి ఆదిమూలం గత కొంతకాలంగా లైంగిక వేధింపులలో భాగంగా బాధపడుతూ అటు అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ ఉన్నటువంటి సత్యవేడు నియోజకవర్గం శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం త్వరగా అనారోగ్యం నుండి కోలుకొని ఈ లైంగిక వేధింపుల కేసు నుండి బయటపడి మళ్లీ సత్యవేడు శాసనసభ్యులుగా కడిగిన ముత్యంలా మళ్లీ మా నియోజకవర్గాన్నికి ప్రజలకు సేవలు అందించాలని పిచ్చాటూరు లో దళితనాయకులు జలకంటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అరుళ్ ప్రకాష్, ఏకాంబరం, రజిని, రాగమ్మ, ఆరుమొగం, రుకేష్, ప్రకాష్, వడివేలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో వరద బాధితులకు నిత్యావసరాలు: ఎమ్మెల్యే ఆరణి

విశాలాంధ్ర-తిరుపతి: విజయవాడ వరద బాధితులకు పది కేజీలు పట్టే 120 బ్యాగ్‌ల రైస్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు అందచేశారు. శనివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే నివాస ఆవరణలో బియ్యాన్ని జనశక్తి ట్రెడ్ యూనియన్ కౌన్సిల్ నాయకులు అలహరి సుధాకర్, తోకల అశోక్ లు అందించారు. వీటితో పాటు గత వారం రోజులుగా నగరంలో నిత్యవసరాలను జనసేన పార్టీ యువ నాయకులు ఆరణి మదన్ నేతృత్వంలో సేకరిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. సుమారు యాభై లక్షల విలువ చేసే నిత్యావసరాలను ప్రత్యేక కిట్ ను ఏర్పాటు చేసి వాటిని నేరుగా వరద బాధితులకు అప్పగించనున్నట్లు ఆయన చెప్పారు. జనసేన అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు నిత్యావసరాలు వరద బాధితులకు అందించనున్నట్లు ఆయన చెప్పారు. వరద బాధితులకు అండగా నిలిచేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని ఆయన కోరారు.

మంత్రి సవితమ్మను కలిసిన డాక్టర్ గుమ్మిడిపూడి దశదాచారి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: బీసీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి సవితమ్మకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి, బీసీ నాయకులు డాక్టర్ గుమ్మిడిపూడి దశదాచారి విన్నవించారు. శుక్రవారం అమరావతి రాష్ట్ర సచివాలయం నందు వెనుకబడిన వర్గాలు, చేనేత శాఖా మంత్రివర్యులు సవితమ్మని కలిసి రాష్ట్ర కార్యదర్శి, బీసీ నాయకులు డాక్టర్ గుమ్మిడిపూడి దశదాచారి మర్యాదపూర్వకంగా కలిశి ముక్కంటి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా బిసి వర్గాలు ఎదుర్కొంటున్నసమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పలు విషయాలను చర్చించి బీసీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లి చేనేత కార్మికులు పడుతున్న ఇబ్బందులను వారికి తెలియపరిచి పరిష్కరించాల్సిందిగా కోరారు. అదేవిధంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వెనుకబడిన వర్గాలని రాజకీయంగా గుర్తించి ఇక్కడ ఉన్నటువంటి నామినేటెడ్ పదవుల్లో అత్యధిక భాగం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ఇప్పించాల్సిందిగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి, బీసీ నాయకులు డాక్టర్ గుమ్మిడిపూడి దశదాచారి కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి బీసీలకు అన్ని పదవుల్లో సమచిత స్థానం కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అదృశ్యమైన బాలిక క్షేమంగా కుటుంబ సభ్యుల చెంతకు

విశాలాంధ్ర-సూళ్లూరు పేట: పోలీసులకు ప్రశంసల వెల్లువ పట్టణములో టైనీ థాట్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 6వ తరగతి చదువుతున్న 12 ఏళ్ల బాలిక షేక్ ఆఫ్రిన్ శుక్రవారం అదృశ్యం కావడంతో పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టి శనివారం ఆ బాలికను క్షేమంగా వారి కుటుంబ సభ్యులు చెంతకు చేర్చారు. బాలిక అదృశ్యంపై స్కూల్ ఆవరణంలో సిసి ఫుటేజ్ లను పట్టణంలోని పలు ప్రాంతాల్లోని సిసి ఫుటేజ్ లను పోలీసులు సేకరించి దానిపై క్షుణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ. మురళీకృష్ణ, ఎస్సై బ్రహ్మనాయుడు లుసిసి ఫుటేజ్ లు తమ పరిశీలనలో తడ రైల్వే స్టేషన్ ప్రాంతంలో మరి కొంతమంది చూసినట్లు తమ దృష్టికి వచ్చిందని దీంతో తడ పరిసర ప్రాంతాలలో కాలిపి చర్యలు చేపట్టామని, అనంతరం చెన్నై సబర్బన్ రైల్వే స్టేషన్ సిసి ఫుటేజీలు పరిశీలించగా బాలిక ఆచూకీ దొరకడంతో రైల్వే పోలీసుల సహకారంతో బాలికను చెన్నై బాలసదనలో ఉంచి అనంతరం క్షేమంగా సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్‌కు తీసుకురావడం జరిగిందని వెల్లడించారు. బాలిక ఆచూకీ కనుక్కొని క్షేమంగా తమ చెంతకు చేర్చిన పోలీసుల సేవలను బాలిక కుటుంబ సభ్యులు స్థానికులు ప్రశంసించారు. పోలీసులను కుటుంబ సభ్యులు సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐ మురళీకృష్ణ మాట్లాడుతూ కుటుంబ సభ్యులు తమ బిడ్డలకు చదువుతోపాటు భద్రతను కల్పించడంలో తక చర్యలు తీసుకోవాలని ఏవైనా సమస్యలు ఉంటే తల్లిదండ్రులకు ప్రజలు చెప్పుకోవాలని దీనిపై మండలంలోని పాఠశాలల్లో పిల్లలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు. విలేకరులకు తెలియజేశారు.

వినాయకునికి ప్రత్యేక పూజలు చేసిన ధనలక్ష్మి

విశాలాంధ్ర-నాయుడుపేట: వినాయకచవితి పండుగ సందర్భంగా నాయుడుపేట పట్టణంలోని దర్గారోడ్ నందు రాజేష్,దర్గారోడ్డులోని వర్తక వ్యాపారులు సినిమా సెట్టింగులను తరదన్నే విధంగా ఏర్పాటుచేసిన 23అడుగుల వినాయక విగ్రహం మండపంలో శనివారం నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వినాయక మండప నిర్వహకులు ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మిని దుశాలవాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

రూ.3 కోట్లతో సిసి రోడ్లు మంజూరు

విశాలాంధ్ర-వి.కోట: మండలంలోని వివిధ గ్రామాల్లో కొత్తగా సిసి రోడ్లు నిర్మాణానికి స్థానిక శాసనసభ్యులు ఎన్. అమర్నాథ్ రెడ్డి పనుఇ మంజూరు చేయించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరిగే సిసి రోడ్ల నిర్మాణం లో భాగంగా శనివారం కుంభార్లపల్లి పంచాయతీ పరిధిలోని గెస్తింపల్లి గ్రామంలో సుమారు 12 లక్షల రూపాయలతో పనులు ప్రారంభించినట్లు మండల పార్టీ అధ్యక్షుడు రంగనాధ్ తెలిపారు. కార్యక్రమంలో విశ్వనాథ్ గౌడు, బాబు తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణను కలిసిన గాలి చలపతినాయుడు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: వెంకటగిరి నియోజకవర్గం బాలాయ పల్లి మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణను టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు విన్నవించారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వెంకటగిరి నియోజకవర్గం బాలాయ పల్లి మండలం బొల్ల వారి పాలెం గ్రామం, అనుకోలు, సుబ్రహ్మణ్యం గ్రామం, బాలాయపల్లి గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలకు, పింఛన్లు, రేషన్ కార్డులు, సీఎం రిలీఫ్ ఫండ్లు, భూ సమస్యలు పరిష్కరించాలని, అక్కడ నిరుపేద కార్యకర్తలకు ఉపాధి అవకాశాలు, కల్పించాలని ఆయా గ్రామాల్లో రోడ్లు నిర్మించాలని చెరువు మరమ్మతులు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణని దృశ్యాలువతో సన్మానించి, సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు, బారు మధు నాయుడు, తొట్టంబేడు మండల బిజెపి అధ్యక్షులు కృష్ణయ్య, తిరకాల హరి గౌడ్, గోపి నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన 12 మందికి కోర్టు జరిమానా

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన 12 మంది వ్యక్తులపై కోర్టు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. తిరుపతి జిల్లా ఎస్పీ వారి ఉత్తర్వుల మేరకు దాడులు నిర్వహించి, మద్యం సేవించిన వారిని, మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులను, పట్టణంలో న్యూసెన్స్ చేస్తున్న వారిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులు హాజరుపరిచారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన 12 మంది వ్యక్తులపై 292 బిఎన్ఎస్ యాక్ట్ ప్రకారం ఒక్కొక్క రికి రూ.1000 చొప్పున మొత్తం రూ.12000, తాగి వాహనం నడిపిన ఒక వ్యక్తిపై 185 ఎం.వి యాక్ట్ క్రింద 10,000 రూపాయలు, అలాగే పట్టణ న్యూసెన్స్ యాక్ట్ కింద ఒక్కొక్కరికి 1000 రూపాయలు చొప్పున మొత్తం 24 వేల రూపాయలు జరిమానాను శ్రీకాళహస్తి కోర్టు విధించినట్లు పోలీసులు తెలిపారు.

లోక్ అదాలత్‌లో కేసులు సత్వర పరిష్కారం

విశాలాంధ్ర-గూడూరు: న్యాయస్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులను పరిష్కరించేందుకు లోక్ అదాలత్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని ఏడవ అదనపు జిల్లా జడ్జి పర్వీన్ సుల్తానా బేగం తెలిపారు. గూడూరు రెండో పట్టణ పరిధిలో ఉన్న కోర్టు భవనముల సముదాయం ప్రాంగణంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మెగా లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చట్ట ప్రకారం రాజీ అయ్యే సివిల్, క్రిమినల్ కేసులను న్యాయమూర్తులు పరిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో తొలిసారిగా 1982 సంవత్సరంలో లోక్ అదాలత్ కార్యక్రమం ప్రారంభమైందని తెలిపారు. లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా పెద్ద సంఖ్యలో దేశవ్యాప్తంగా కేసులు పరిష్కారం అవుతుండడంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రతి రెండు నెలలకు ఒకసారి దేశవ్యాప్తంగా ఒకేసారి మెగా లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. కక్షిదారులు లోక్ అదాలత్ కార్యక్రమం పట్ల అవగాహన పెంచుకొని లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాదులు, పోలీస్ శాఖ అధికారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవి పైన విస్తృత అవగాహన కల్పిస్తున్న కోర్ సంస్థ

విశాలాంధ్ర-యర్రావారిపాళ్యం: హెచ్ఐవి అంటు వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని, సురక్షితం కానీ లైంగిక సంబంధాల వల్ల, శుభ్రపరచని సిరంజుల సూదులు వాడడం వల్ల, పరీక్ష చేయని రక్త మార్పిడి వల్ల, హెచ్ఐవి ఉన్న తల్లి నుండి బిడ్డకి హెచ్ఐవి సోకే ప్రమాదం ఉందని కోర్ సంస్థ ప్రతినిధి తులసి అన్నారు. శనివారం మండలంలో వారపు సంత ఆవరణలో సంతకు వచ్చిన ప్రజలతో కోర్ సంస్థ ఎన్జీవో వాళ్ల ఆధ్వర్యంలో "మీకు తెలుసా"హెచ్ఐవి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కోర్ సంస్థ ప్రతినిధి విజయలక్ష్మి మాట్లాడుతూ టాటూలు వేయించుకో కూడదని ప్రజలకి సూచించారు. కండోమ్ ప్రాముఖ్యతని వివరించారు. హసీనా మాట్లాడుతూ టిబి, ఎస్టిఐ పైన హెచ్ఐవి ఎలా వస్తుంది, వస్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో కోర్ సంస్థ ప్రతినిధులు తులసి, విజయలక్ష్మి, హసీనా పాల్గొన్నారు.

బంగారమ్మ కాలనీ అభివృద్ధి సేవా సంఘం ఏర్పాటు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి : పట్టణంలోని బంగారమ్మ కాలనీ అభివృద్ధి కోసం బంగారమ్మ కాలనీ అభివృద్ధి సేవా సంఘంను శనివారం నూతనంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడుగా నూతలపాటి వనమాలి నాయుడు, ఉపాధ్యక్షులుగా మనోహర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా మాధవయ్య, కార్యనిర్వాహక సభ్యులుగా భాస్కరరెడ్డి, రమణారెడ్డి, గోవిందస్వామిరెడ్డి, సోమశేఖర్ నాయుడు, లీలామోహన్ తదితరులను ఎన్నుకొన్నారు. సంఘం మౌలిక సదుపాయాలు, అభివృద్ధికి కృషి చేస్తుందని సంఘం అధ్యక్షుడు నూతలపాటి వనమాలి నాయుడు ఈ సందర్భంగా తెలియజేశారు.

ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం

విశాలాంధ్ర-చౌడేపల్లి: చౌడేపల్లి సిపిఎం శాఖ మహాసభ శనివారం రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. మహాసభలో అమరవీరులకు నివాళులర్పిస్తూ సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. రెండు రోజుల క్రితం అనారోగ్యంతో చనిపోయిన సిపిఎం ఆల్ ఇండియా కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పరిశీలకులుగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, జిల్లా నాయకులు గిరిధర్ గుప్తా లు మాట్లాడుతూ సిపిఎం నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న ప్రజా గొంతుకగా ఉన్న పార్టీ అని తెలిపారు. ఈ రోజు దేశవ్యాప్తంగా ఏచూరి గురించి ఎంత గొప్పగా చెబుతున్నారంటే ఆయన ప్రజల కోసం చేసిన పోరాటాలు ఆయన ను ఈ స్థాయికితెచ్చాయి. పార్టీ ప్రతిష్ట పెరిగింది. విద్యార్థి దశనించే ధైర్యశాలిగా పోరాడుతూ దేశంలోనే ఒక ముద్ర వేసుకున్న గొప్ప నాయకుడు అని కొనియాడారు. పార్లమెంట్ లోను బయట ప్రజలు గొంతు గా వున్నారు కాబట్టే ఈరోజు దేశం మొత్తం కీర్తిస్తున్నది. దేశంలో మొత్తం చేయదానికి ఆయన చేసిన కృషి అమోఘం అన్నారు ఇలాంటి గొప్ప నేతలు ఉన్న సిపిఎం పార్టీ విస్తరణకు ప్రతి శాఖ కృషి చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు అనంతరం శాఖ కార్యదర్శి మూడు సంవత్సరాల కాలంలో జరిగిన నివేదికను ప్రవేశపెట్టారు ఆ నివేదికపై సభ్యులు చర్చ పెట్టి భవిష్యత్తులో జరిగే ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలని తీర్మానించారు మహాసభలో మండలంలో ఉన్న సమస్యలు బోయకొండ అభివృద్ధి కోసం షాపులు ఇల్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని తీర్మానం చేసారు అలాగే మహిళా కార్యకర్తల రాజకీయ వేదింపులు మానుకోవాలని పేదలకు రెవెన్యూ సమస్యలు పరిష్కారం చేయాలని కార్మికుల సమస్యలు పరిష్కారంచేయాలని తీర్మానం చేశారు. సమావేశం లో డాక్టర్ చంద్ర రామకృష్ణ వాసు పాల్గొన్నారు. మహాసభలు చర్చలు తీర్మానాలు అనంతరం నూతన కార్యదర్శిగా ఏకగ్రీవంగా డాక్టర్ చంద్రను ఎన్నుకొన్నారు.

జాతీయ నులిపురుగుల దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ, ర్యాలీ

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి, సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఉదయం డా. బి.కుసుమ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల దినోత్సవంపై మండల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు, కిశోర బాలులకు ఆల్బెండజోల్ 400 ఎం.జి. మాత్రలను ఇచ్చి నులిపురుగులను నిర్మూలించాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయుటలో మండల అధికారులు సహకరించాలని డా. బి.కుసుమ విజ్ఞప్తి చేశారు. అనంతరం జాతీయ నులిపురుగుల దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల డెవలప్మెంట్ అధికారి, మండల రెవిన్యూ అధికారి, మండల విద్యా శాఖాధికారి, సీడీపీఓ, ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురు మరియు బాలికల ప్రిన్సిపాళ్లు, ఐసిడిఎస్ సూపెర్వైజర్లు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపెర్వైజర్లు, సచివాలయ ఏఎన్ఎం.లు, ఎంఎల్హెచ్పిలు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాలు సేకరణ

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విజయవాడ వరద బాధితుల సహాయార్థం కొరకు గూడూరు పట్టణానికి చెందిన శ్రీ గాయత్రీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ వరద బాధితుల సహాయం కోసం తమ పాఠశాల విద్యార్థులు విరాళాలు సేకరించడం అభినందనీయం అన్నారు . ప్రతి ఒక్కరూ చిన్నతనం నుండే సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని పేర్కొన్నారు. తాము సేకరించిన విరాళాలను సి.ఎం రిలీఫ్ ఫండ్‌కు పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటిచంద్ర శేఖర్, ముని రాజ, పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పారిచెర్లవారిపాళెం గ్రామస్తుల రాస్తారోకో

విశాలాంధ్ర-చిల్లకూరు: పారిచెర్లవారిపాళెం గ్రామస్తులు శనివారం రాస్తారోకో చేపట్టారు. మేఘా రహదారినిర్మాణసంస్థ యాజమాన్యం చిల్లకూరుమండలపరిధిలోని జాతీయరహదారి వరగలి అడ్డరోడ్డు నుండి పోర్టు నుంచి సరుకుల రవాణా సులభతరం కోసం కేంద్ర ప్రభుత్వ నిధులతో, జాతీయరహదారులనిర్మాణసంస్థ అధికారుల పర్యవేక్షణలో నిర్మాణం జరుపుతున్న విషయం తెలిసిందే. కానీ టిప్పర్ల అతివేగం , దుమ్ము ధూళి కాలుష్యం నివారణ చర్యలు తీసుకోకుండా, రహదారిపై నీరు చల్లకుండా, చిద్రమైన రహదారిపై తారు వేయకుండా వారి పనులు కొనసాగుతున్న తీరు కు నిరసనగా రాస్తారోకో గ్రామస్తులు నిర్వహించారు. మేఘా ప్రతినిధి ప్రసన్న రెడ్డి గ్రామస్తులు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని, తారు రహదారి పై వేస్తామని ఇవన్నీ 7 నుంచి 10 రోజుల వ్యవధిలో దగ్గర ఉండి చేయిస్తానని హామీ గ్రామస్తులకు ఇచ్చారు. రాస్తారోకో విరమణ జరిగింది.

రాజీతో సత్వరమే కేసులు పరిష్కారం

సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

విశాలాంధ్ర-పుత్తూరు టౌన్: రాజీతో సత్వరమే కేసులు పరిష్కరించు కోవచ్చని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర తెలిపారు. శనివారం పుత్తూరు కోర్ట్ ఆవరణంలో జాతీయ లోకాదాలత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర మాట్లాడుతూ లోకాదాలత్ అంటే మనం దీపావళి చేసుకున్న రోజు లాంటిది. లోకదాలత్ కక్షి దారులు కోప తాపాలతో కేసులు పెట్టకుని కోర్టు చుట్టూ తిరుగుతూ సమయాన్ని ధనమును వృధా చూసుకుంటూ ఉంటారు అలాంటి లేకుండా లోకాదాలతో కేసులు పరిష్కారం కుటుంబం లో ప్రశాంతత ఉంటుందని అన్నారు. అనంతరం జూనియర్ సివిల్ జడ్జి జానకి మాట్లాడుతూ భార్యాభర్తలు చిన్నచిన్న గొడవలు వేసుకుని కోర్టు చుట్టూ తిరగకుండా ఐకమత్యం గా ఉండి కేసులు లేకుండా ఉండాలని లోకాదాలతో కేసుల్లో పరిష్కారం జరిగితే శాశ్వత పరిష్కారం జరిగినట్టే అన్నారు. ఒకరి కొకరు తగ్గినట్లయితే ఎదుటి వ్యక్తి కూడా రెండు మెట్లు తగ్గి సమస్య పరిష్కారం జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో బార్అసోసియేషన్ అధ్యక్షులు కే.పురుషోత్తం, న్యాయవాది సంజీవి, న్యాయవాదులు, కక్షి దారులు పాల్గొన్నారు.

స్విమ్స్- సైకియాట్రిస్ట్ విభాగం ఆధ్వర్యంలో

ఆత్మహత్య నివారణా దినోత్సవం విజయవంతం

విశాలాంధ్ర -తిరుపతి: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) సైకియా ట్రిస్ట్ విభాగం వారి ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ వారాత్సోవాలలో భాగంగా శనివారం సాయంత్రం 4.00 గ॥లకు స్విమ్స్ -శ్రీ పద్మావతి ఆడిటోరియం నందు నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా.రామ్ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా.ఆర్.వి. కుమార్, డీన్ డా.అల్లాడీ మోహన్, రిజిస్ట్రార్ డా.అపర్ణ ఆర్ బిట్ల్లా,యస్. పి.యం.సి. డబ్ల్యు ఇంచార్జ్ ప్రిన్సిపల్ డా. నాగరాజు, ఫిజియోథెరపీ కాలేజీ ప్రిన్సిపల్ డా. మాదవి, కార్డీయాలజీ సీనియర్ ప్రొఫెసర్ డా.వనజాక్షమ్మ, సైకియాట్రిస్ట్ విభాగాధిపతి డా.గణేష్ కుమార్, తిరుపతి సీనియర్ సైకిరియార్టీ డా.కిషోర్ కుమార్ సంయుక్తంగా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ముందుగా సైకి యాట్రి సమస్యలతో చనిపోయిన వారి కోసం రెండు నిముషాలు మౌనం పాటించారు.స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా.ఆర్.వి. కుమార్ మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం సెప్టంబర్ నెలలో ఈ వారాన్ని గా జరపుకుంటామని, ఆత్మహత్యలు విపరీతంగా పెరిగి ఒక పాండమిక్‌గా మారుతున్నాయని, ముఖ్యంగా విద్యా ర్థులలో అధిక మానసిక ఒత్తిడి వల్ల, తల్లిదండ్రుల ఒత్తిడి వల్ల, పరీక్ష లలో విఫలమవ్వడం వల్ల ఆత్మహ త్యలు చాలా పెరుగుతు న్నాయి. వీటిని ఖచ్చితంగా అరికట్టే పద్ధతులు మనం పాటించాలని తెలిపారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన తిరుపతి సీనియర్ సైకియాట్రిస్ట్ డా.కిషోర్ కుమార్ మాట్లాడుతూ... సూసైడ్ అనేది పలు రకాల కారణాల వల్ల జరుగుతున్నాయని, ముఖ్యంగా పరస్పర విభేదాలు, వాదనలు, కొన్ని మానసిక కారణాల వల్ల ఆత్మహత్యలు చేసుకుంటారని అన్నారు. ఇంకా అవగాహన ప్రోగ్రామ్ నిర్వహించిన స్విమ్స్ సైకియా ట్రిస్ట్ విభాగాధిపతి డా.గణేష్ కుమార్, సైకియాట్రిస్ట్ సీనియర్ రెసిడెంట్ డా. దుర్గాంజలి మాట్లాడుతూ.. "నేషనల్ క్రిమినల్ రికార్డ్స్ బ్యూరో ప్రకారం 2022లో దాదాపు ఒక లక్షకి 13 మంది సూసైడ్ చేసుకుంటున్నారని, 2021తో పోలిస్తే ఇది దాదాపు 3 రెట్లు పెరిగింది. ముఖ్యంగా యువతలో ప్రతి సంవత్సరం 5 శాతం అదనంగా సూసైడ్ రికార్డ్స్ అవుతున్నాయి. చాలామంది ఆత్మ హత్య చేసుకొనే వారిని నెగటివ్ దృక్పదంతో చూస్తారు. అది ఒక కలంకంగా భావి స్తారు. ఇంకొంతమంది సూసైడ్ గురించి మనసు విప్పి మాట్లాడారు. ఈ ఆలోచనా విధానాన్ని మార్చుకొని సూసైడ్ గురించి మీకు దగ్గరలో ఉన్న మానసిక నిపుణులతో మాట్లాడి దానికి తగిన కౌన్సి లింగ్ , అవసరం అయితే మందులు వాడాల్సి వస్తుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సైకియాట్రిస్ట్ విభాగం డాక్టర్లు, యు.జి, పి.జి వైద్య విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసులను సామరస్యంగా పరిష్కరించుకోవచ్చు

- జిల్లా ప్రధాన్యాయమూర్తి భీమారావు

విశాలాంధ్ర -చిత్తూరు: రాజీ చేసుకోదగిన క్రిమినల్, సివిల్ కేసులు అన్ని కూడా జాతీయ లోక్ అదాలత్‌లో సామరస్యంగా పరిస్కారించుకోవచ్చునని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు ఇ. భీమారావు పేర్కొన్నారు.శనివారం ఉదయం జిల్లా కోర్టు నందు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వెన్నిల, ఒకటవ అదనపు జిల్లా జడ్జి రమేష, బార్ అసోసియేషన్ అధ్య క్షులు రాజేంద్ర రెడ్డి, కార్యదర్శి అశోక్ యాదవ్‌లతో కలసి జిల్లా కోర్టు నందు నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయ మూర్తి మాట్లాడుతూ భారత సుప్రీంకోర్టు న్యాయ సేవ అధికార సంస్థ , రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో జాతీ య లోక్ అదాలత్ ను నిర్వ హించడం జరుగుతుందని తెలిపారు. మన దేశంలో కుటుంబ వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యత కలదని ఏ బంధానికైనా నమ్మకమే ప్రధానమని, చిన్న చిన్న గొడవలను ఓర్పుతో పరిష్క రించుకోవాలే తప్ప కోర్టు వరకు రాకుండా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ మండల న్యాయ సేవ అధికార సంస్థ వద్ద పరిష్కరిం చుకోవచ్చునని తెలిపారు, ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, జాతీయ లోక్ అదాలత్ లో రాజిపడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్, భూ తగాదాలు,మోటార్ వాహనాల కేసులు,చెక్ బౌన్స్ కేసులు,బ్యాంక్ కేసులు, మొదలగు కేసులనుపరిష్కరించుకోవచ్చునని తెలిపారు.ఈ జాతీయ లోక్ అదాలత్ కు గాను ముందస్తుగా జిల్లా వ్యాప్తంగా 9259 కేసులను గుర్తించడం జరిగిందని తెలిపారు. లోక్ అదాలత్ లో న్యాయమూర్తులు,న్యాయ వాదులు,రెవిన్యూ, పోలీసు, బ్యాంకు అధికారులు ,చిట్ ఫండ్ కంపిణి లు,భీమ సంస్థ ప్రతినిధులు, కక్షదారులు పాల్గొని, జిల్లాలో ఎక్కువ కేసులు పరిష్కరించి చిత్తూరు జిల్లాను రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో ఉండేలా సహకరించాలని సూచించారు.ఈకార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వెన్నిల మాట్లాడుతూ లోక్ అదాలత్ లో ఇచ్చిన తీర్పు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని తెలిపారు.లోక్ అదాలత్ లో కేసులు పరిస్కారించు కోవడం వల్ల సమయం,డబ్బు ఆధావుతుం దన్నారు. రాజిమార్గమే రాజ్యమార్గంని అందురు తెలుసుకోవా లన్నా రు.జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా చిత్తూరు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ పరిధిలోని తిరుపతి,మదనపల్లి, తంబల్లపల్లి, పీలేరు,వాల్మీకుపురం,పుంగనూరు, పాకాల, పలమనేరు, కుప్పం, పుత్తూరు,నగరి,సత్యవేడు, 13 మండల కేంద్రాలలో జిల్లా కేంద్రంలో 35 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందని, చిత్తూరు జిల్లా కోర్టు ఆవరణలో 6 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో బార్ అసోషియేషన్ అధ్యక్షులు,కార్యదర్శి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా అనేక సమస్యల కేసులను పరిష్కరించుకోవచ్చు అన్నారు. ప్రమాదాల ద్వారా మరణించిన కుటుంబాలు వీధిని పడకు ండా బీమా సంస్థలతో వారికి పరిహారం చెల్లించడం జరుగుతుంది అన్నారు. ఈ అవకాశాన్ని కక్ష దారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో పోలీసు, రెవిన్యూ, బి ఎస్ యన్ యల్,బ్యాంకు అధికారులు, చీట్ ఫండ్,బీమా సంస్థలు యాజమాన్యం,కక్షదారులు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలు ప్రారంభం..!

యాగశాలలో కొనసాగుతున్న వైదిక క్రతువులు - గ్రామంలో పవిత్ర మాలలు ఊరేగింపు

యాగశాలలో శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్టాపన - శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునికి తిరుమంజన సేవ

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తుమ్మల గుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం నుంచి పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి తోమలసేవ, కొలువు, పంచాంగశ్రవణం,సహస్ర నామార్చన నిర్వహిం చారు .అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవర్లను కల్యాణ మండపంలోకి వేంచేపు చేశారు.అనంతరం యాగశాలలో జరిగిన వైదిక కార్యక్రమాల్లో భాగంగా పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, రక్షా బంధనం, అన్నప్రానాయానం నిర్వహించారు.అనంతరం పవిత్ర మాలలు ఊరేగింపుగా ఆలయంలోకి తీసుకు వచ్చారు.శ్రీదేవి,భూదేవి సమేత శ్రీనివా సుని ఉత్సవమూర్తులకు స్నపన తిరుమం జనంను వైభవంగా చేశారు.ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, చందనంతో విశేషంగా ఉత్సవర్లను అభిషేకం చేశారు. సాయంత్రం శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారు గ్రామంలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. రాత్రి యాగశాల వైదిక కార్యక్రమాలు నిర్వహించి శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ఠ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి సోదరుడు చెవిరెడ్డి రఘునాథ రెడ్డి, మంజుల దంపతులతో పాటు గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

తిరుచ్చి వాహనంపై ... భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ కళ్యాణ వెంకన్న

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి మండలం శ్రీనివాస మంగాపురంలో వెలసిన కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారు ఉభయదేవేరులతో కలిసి శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై విహరించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారిని వేకువఝామున సుప్రభాత సేవతో మేల్కొల్పి అనంతరం శాస్త్రోత్తకంగా నిత్య కట్ల కైంకర్య సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారి నిత్య కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ ముఖ మండపంలోకి తీసుకువచ్చి సుగంధ ద్రవ్యాలతో శుభ్రపరిచి, పట్టు పితాంబరాలతో అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్టించారు. అనంతరం స్వామి వారు శ్రీనివాస మంగాపురం తిరుమాఢ వీధుల్లో విహరించగా భక్తులు పెద్ద సంఖ్యలో కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఆఫీసర్ పి. వరలక్ష్మి, టెంపుల్ సూపరింటెండెంట్ వి. రమేష్ బాబు, టెంపుల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, అర్చకులు : దివి మురళి కృష్ణమాచార్యలు స్వామీ, గోపాల్ భట్టాచార్య సంతాన కృష్ణన్ అధ్యాపక, లక్ష్మి రాజేష్ స్వామీ పరిచారిక , నాళ్ళురి విష్ణుమూర్తి స్వామీ పరిచారిక, టెంపుల్ జమెదర్ మంకు చిరంజీవి భక్తులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

18న అన్నా క్యాంటీన్ల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయండి

- స్వచ్ఛత హి సేవ కార్యక్రమం విజయవంతం చేయండి

- కమిషనర్ ఎన్.మౌర్య

విశాలాంధ్ర - **తిరుపతి :** నగరపాలక సంస్థ పరిధిలోని నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్లను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. అన్నా క్యాంటీన్ల ప్రారంభోత్సవం పై ఇంజనీరింగ్ అధికారులు అక్షయపాత్ర నిర్వాహకులతో శనివారం కమిషనర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు అన్ని హంగులతో స్వీమ్స్ కూడలి, న్యూ బాలాజీ కాలని, ముత్యాల రెడ్డి పల్లి, ఇఎస్ఐ హాస్పిటల్ వద్ద గల అన్నా క్యాంటిన్లను ఏర్పాటు చేసామని అన్నారు. అయితే మొదటి దశలో ప్రారంభం కాలేదని, ఈ 18న రెండవ దశలో ప్రారంభించాలని ప్రభుత్వం నుండి ఉత్తర్వులు అందాయని అన్నారు. ఈ మేరకు నాలుగు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు సరిచూసుకోవాలని అన్నారు. క్యాంటిన్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అన్నారు. ప్రజలకు అందించే ఆహారం సరైన సమయంలో ఇచ్చేలా చూడాలని అక్షయపాత్ర నిర్వాహకులను ఆదేశించారు. ప్రారంభోత్సవానికి ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తగా చూడాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమాల నిర్వహణపై ఇప్పటికె అధికారులకు అన్ని విధులు కేటాయించామని అన్నారు. వారందరూ వారికి పనులు సక్రమంగా చేసి, స్వచ్ఛత హి సేవా కార్యక్రమం విజయవంతం చేయాలని కమిషనర్ అన్నారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, డి.ఈ. లు విజయ్ కుమార్ రెడ్డి, సంజయ్ కుమార్, మహేష్, రాజు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు,శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, మెప్మా కృష్ణవేణి, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.